# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ జనవరి 21 మంగళవారం 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 182

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణం

2లో






# దావోస్‌లో ఇద్దరు తెలుగు సీఎంల భేటీ

హైదరాబాద్,: స్విట్జర్లాండ్ లోని దావోస్ లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్తుకు తెలుగు రాష్ట్రాల నుంచి ఇద్దరు సీఎంలు మంత్రులు హాజరయ్యారు. మంత్రులతో కలిసి దావోస్ పర్యటనకు వెళ్లిన సమయంలో అరుదైన కలయిక జరిగింది. జ్యూరిచ్ చేరుకున్న ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రులు, అధికారుల బృందం.. అదే ఎయిర్ పోర్టులో అప్పటికే అక్కడ ఉన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. తెలుగు రాష్ట్రాల ఇద్దరు సీఎంలు, మంత్రులు ఒకే చోట కలిసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. చిత్రలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేష్, శ్రీధర్ బాబు, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహననాయుడు ఉన్నారు. మంత్రి శ్రీధర్ బాబు భుజంపై చేతులేసి.. షేక్ హ్యాండ్ ఇస్తున్నారు సీఎం చంద్రబాబు. ఉదయం జ్యూరిచ్ ఎయిర్ పోర్టులో వీళ్ల మీటింగ్ జరిగింది.తెలుగు రాష్ట్రాలకు పెట్టుబడులపై లక్ష్యంగా.. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, అధికారుల బృందం దావోస్ లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరైంది.

# ఏడాదిలో ఏం చేశావ్ రేవంత్ రెడ్డి?



## మరోమారు అసహనం వ్యక్తం చేసిన కెటిఆర్

హైదరాబాద్ :ఈ ఏడాది కాలంలో రూ. లక్షా 40 వేల కోట్లు అప్పు చేసి ఏం పీకినవ్ రేవంత్ రెడ్డి..? అంటూ మరోమారు కెటిర్ తన అసహన భాషలో మాట్లాడారు. ఏడాదిలో ఏంచేశారని అడగడానికి ఆయన తన వల్గర్ లాంగ్వేజీలో ప్రశ్నించారు. ఒక కొత్త ఇటుక పెట్టినవా, ఒక కొత్త పైప్ లైన్ వేసినావా, ఒక కాలువ తవ్వినవా, ఒక కార్మికుడికి లాభం తెచ్చవా, ఒక ఆడబిడ్డకు రూ.2500 ఇచ్చావా, తులం బంగారం ఇచ్చవా..? ఏం పీకినవ్ సంవత్సరంలో అని రేవంత్ రెడ్డిని కేటీఆర్ నిలదీశారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ కార్మిక విభాగం క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా కేటీఆర్ ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చాలా హామీలు ఇచ్చింది.. హామీల అమలు కోసం నిలదీస్తే మీకు జీతాలు ఇచ్చుడే ఎక్కువ అని ఉద్యోగులను బెదిరిస్తున్నారు. కేసీఆర్ అప్పులపాలు చేసిపోయారు అని చెబుతుండ్రు. ఈ తప్పుడు ప్రచారాన్ని, పనికిమాలిన వెధవ ప్రచారాన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత మనపైనే ఉంది. వాళ్లు మాట్లాడే మాటలు పచ్చి బక్వాస్ మాటలు, బోగస్ మాటలు. ఎలా అంటే.. 2014లో రాష్ట్రం ఏర్పడినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మనకు అప్పజెప్పారు. మన రాష్ట్రం మీద ఉన్న అప్పు ఆనాడురూ. 72 వేల కోట్లు. తలసరి ఆదాయం రూ. లక్షా 14 వేలు. రూ. 369 కోట్లు రెవెన్యూ మిగులు ఉండే. మనం దిగిపోయినాడు.. తలసరి ఆదాయం రూ. 3 లక్షల 56 వేలకు తీసుకుపోయిండు కేసీఆర్. రెవెన్యూ మిగులు రూ. 5,944 కోట్లతో కాంగ్రెస్‌కు అప్పజెప్పాం.

# సంజయ్ రాయ్‌కు జీవిత ఖైదు

కోల్‌కతా: దేశవ్యాప్తంగా పెను సంచలనం రేపిన ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలిపై హత్యాచారం కేసులో దోషి సంజయ్ రాయ్‌కి శిక్ష ఖరారైంది. కోల్‌కతాలోని సియాల్దా కోర్టు అతడికి జీవితఖైదు విధించింది. అలాగే బాధిత కుటుంబానికి రూ.17 లక్షల పరిహారం చెల్లించాలని బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఘటన అరుదైన కేసు కేటగిరీలోకి రాదని వ్యాఖ్యానించింది. మరణశిక్ష విధించకపోవడానికి ఇదే కారణమని తెలిపింది. ఈ శిక్ష ఖరారు చేయడానికి ముందు న్యాయమూర్తి ఇరు పక్షాల వాదనలు విన్నారు. తనను ఈ కేసులో తప్పుగా ఇరికించారని సంజయ్ రాయ్ తన వాదన వినిపించగా.. ఇది అరుదైన కేసని, అతడికి మరణ శిక్ష విధించాలని సీబీఐ తరఫు న్యాయవాది వాదించారు. శనివారం

మిగతా 2లో






2లో

## యాదాద్రీశుడి ఆదాయం
# రూ.4,17,13,596



# వైభవంగా కొమురవెల్లి మల్లన్న జాతర

సిద్దిపేట: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి జాతర ఘనంగా ప్రారంభమైంది.సిద్దిపేట జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి జాతర ఘనంగా ప్రారంభమైంది. సంక్రాంతి తర్వాత వచ్చిన తొలి ఆదివారం కావడంతో భారీగా భక్తులు తరలివచ్చి మల్లన్నను దర్శించుకుంటున్నారు. సుమారు రెండున్నర నెలల పాటు కొనసాగనున్న ఈ జాతర.. ఉగాదికి ముందు వచ్చే ఆదివారంతో ముగియనుంది.

తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలి వస్తున్నారు.

## మైనింగ్‌కు వ్యతిరేకంగా గ్రామస్థుల పోరుబాట

**మైలారం గ్రామంలో ఆందోళనకు దిగిన స్థానికులు**

**ఆందోళనకారుల అరెస్ట్‌తో గ్రామంలో ఉద్రిక్తత**



**నాగర్ కర్నూల్:** నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం మైలారంలో గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. 'మైనింగ్ వద్దు.. గుట్ట ముద్దు' అనే నినాదంతో రైతులు నేటి నుంచి రిలే నిరాహార దీక్షలకు సన్నద్ధమయ్యారు. దీంతో పోలీసులు ముందస్తుగా పలువురు రైతులు, స్థానికులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమ గ్రామానికి చెందిన రైతులను అక్రమంగా అరెస్ట్ చేశారని, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ? గ్రామస్తులు పెద్ద ఎత్తున మహిళలు, రైతులు రోడ్డుపైకి చేరి నిరసనకు దిగారు. అరెస్టు చేసిన రైతులను వెంటనే విడుదల చేయకపోతే ఆత్మహత్య చేసుకుం టామని హెచ్చరించారు. పురుగుల మందు డబ్బాతో రోడ్డుపై బైఠాయించి ఆందోళన ఉధృతం చేశారు. గ్రామం లోనికి పోలీసులను రానీయకుండా ముళ్లకంచెలు వేశారు. మైలారం గ్రామస్తులు చేపట్టిన ఈ ఆందోళనకు మద్దతు తెలపడానికి హైదరాబాద్ నుండి బయలుదేరి వచ్చిన పౌరహక్కుల నేతలు ప్రొఫెసర్ హరగోపాల్, గడ్డం లక్ష్మణ్ లను కూడా పోలీసులు వెల్దండ వద్ద అడ్డగించి అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. దీంతో మైలారం గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. మైనింగ్ కు వ్యతిరేకంగా గ్రామస్తుల నిరసన కొనసాగుతోంది. అయితే రైతులు, గ్రామస్తులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో తీవ్ర ఉద్రిక్తతలకు దారి

మిగతా 2లో




2లో

## సీఎం రేవంత్ మాటలు కోటలు.. చేతలు గల్లీ కూడా దాటవు

రాష్ట్రంలో కనీసం జీతాలు కూడా ఇవ్వలేని స్థితి : హరీశ్‌రావు

**మహిళల హక్కులను కాపాడే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన మహిళా కమిషన్ సభ్యులకు గత సంవత్సర కాలం నుంచి రేవంత్ రెడ్డి ప్రభుత్వం జీతాలు ఇవ్వడం లేదని తాజాగా నా దృష్టికి వచ్చింది అని హరీశ్‌రావు గుర్తు చేశారు.**

# మళ్లీ తెలంగాణలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు



**హైదరాబాద్:** తెలంగాణ వ్యాప్తంగా చల్లని గాలులు వీస్తున్నాయి. పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యాయి. చలి విపరీతంగా ఉండడంతో ఆయా ప్రాంతాల ప్రజలు వణికిపోతున్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు ప్రాంతాల్లో పొగమంచు కూడా దట్టంగా కురుస్తోంది. దీంతో వాహనదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు వారం రోజుల తర్వాత సోమవారం ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యాయి. హైదరాబాద్ నగర శివార్లతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు నగర శివార్లలోని మొయినాబాద్‌లో 9.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, కుమ్రం భీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, సంగారెడ్డి, నిర్మల్ జిల్లాల్లో పలు చోట్ల 6.5 డిగ్రీల నుంచి 9 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. రాబోయే మూడు రోజుల పాటు పలు ప్రాంతాల్లో ఈ ఉష్ణోగ్రతలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. 5 నుంచి 10 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. ఈ మూడు రోజుల్లో పొద్దున్నే పొగమంచు దట్టంగా కురిసే అవకాశం ఉందని, వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు.

# నకిలీ నోట్ల చెలామణి

రద్దు చేయాలన్న ఆలోచన లేదన్న ఆర్‌బిఐ




**ముంబై:** ప్రస్తుతం మార్కెట్‌లో 500 మరియు 200 రూపాయల నోట్లు ఎక్కువగా చెలామణిలో ఉన్నాయి. దీనికి సంబంధించి రిజర్వ్ బ్యాంక్ కీలక ప్రకటన చేసింది. ఆర్‌బీఐ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. మార్కెట్లో నకిలీ 200 రూపాయల నోట్లు వస్తున్నాయని, నకిలీ నోట్లను అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నామని ఆర్బీఐ తెలిపింది. కొందరు 200 రూపాయల నోట్లను రద్దు చేస్తున్నట్లు పుకార్లు సృష్టిస్తున్నారని, అలాంటిదేమి లేదని స్పష్టం చేసింది. ఇలాంటి వార్తలను ప్రజలు నమ్మవద్దని సూచించింది. 2000 రూపాయల నోట్లపై నిషేధం తర్వాత దేశంలో నకిలీ 200, 500 రూపాయల నోట్ల చెలామణి నిరంతరం పెరుగుతోందని ఆర్‌బిఐ తెలిపింది. ఇలాంటి పరిస్థితిని క్యాష్ చేసుకోవడానికి కేటుగాళ్లు రంగంలోకి దిగి నోట్లను రద్దు చేస్తున్నట్లు పుకార్లు సృష్టిస్తున్నారని ఆర్బీఐ తెలిపింది. లావాదేవీల సమయంలో ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హెచ్చరించింది. ఇటీవల తెలంగాణలో 200 రూపాయల నోట్లకు కలర్ జిరాక్సులు తీయించి చలామణి చేస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వేగుచుక్క

# అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణం

**ప్రమాణం చేయించిన సుప్రీం ప్రధాన న్యాయమూర్తి**
**తొలుత ప్రమాణం చేసిన ఉపాధ్యక్షుడు జెడి వాన్స్**
**హాజరైన విదేశాంగ మంత్రి జైశంకర్...ముఖేశ్ అంబానీ**

వాషింగ్టన్: అమెరికా నూతన అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణస్వీకారం చేశారు. వాషింగ్టన్‌లోని క్యాపిటల్ హిల్ రోటుండాలో అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమానికి ప్రపంచ దేశాలకు చెందిన పలువురు అగ్రనేతలు, పారిశ్రామిక, టెక్ దిగ్గజాలు, అతిరథ మహారథులు హాజరయ్యారు. వీరందరి సమక్షంలో అగ్రరాజ్యం 47వ అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణస్వీకారం చేశారు. గతేడాది నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన 78 ఏళ్ల ట్రంప్ చేత అమెరికా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జాన్ రాబర్ట్స్ ప్రమాణం చేయించారు. 1861లో అబ్రహాం లింకన్ ప్రమాణ స్వీకారం చేయడానికి ఉపయోగించిన బైబిల్, తన బైబిల్‌ను చేతిలో పట్టుకొని ట్రంప్ బాధ్యతలు స్వీకరించారు. ట్రంప్ కంటే ముందు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రమాణ స్వీకారం చేశారు. దేశ, విదేశీ అతిథులతో క్యాపిటల్ హిల్ రోటుండా కిటకిటలాడింది.

ప్రమాణస్వీకారోత్సవానికి ముందు జో బైడెన్‌ను కలిసేందుకు ట్రంప్ శ్వేత సౌధానికి వెళ్లగా.. ఆయనకు బైడన్ దంపతులు సాదరస్వాగతం పలికారు. పరస్పరం కరచాలనం చేసుకున్నారు. అనంతరం శ్వేతసౌధం

నుంచి వాషింగ్టన్ డీసీ క్యాపిటల్ హిల్‌లోని రోటుండా ఇండోర్‌లో జరిగే ప్రమాణస్వీకారోత్సవానికి జో బైడెన్, ట్రంప్ ఒకే వాహనంలో వెళ్లారు. భారత్ తరఫున ఈ ప్రమాణస్వీకారోత్సవానికి కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ హాజరయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ తరఫున హాజరైన జైశంకర్.. ట్రంప్‌నకు మోదీ రాసిన లేఖను అందజేసారు. మెరికా అధ్యక్షుడి ప్రమాణస్వీకార వేడుకకు భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించే అరుదైన గౌరవం తనకు దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ వేడుకకు ముకేశ్ అంబానీ దంపతులు సైతం హాజరయ్యారు. పలువురు అమెరికా మాజీ అధ్యక్షులు సతీసమేతంగా ఈ వేడుకకు విచ్చేశారు. బిల్ క్లింటన్, హిల్లరీ క్లింటన్, జార్జి డబ్ల్యూ బుష్, లారా బుష్ తదితరులు విచ్చేశారు. బరాక్ ఒబామా హాజరైనప్పటికీ మిచెల్లీ ఒబామా మాత్రం ఈ వేడుకకు రావడంలేదని ముందే ప్రకటించారు. అమెరికా సుప్రీంకోర్టుకు చెందిన తొమ్మిది మంది జడ్జిలు ఈ వేడుకకు హాజరయ్యారు. ట్రంప్ క్యాబినెట్‌లో చోటు దక్కించుకున్న నేతలతో పాటు వివేక్ రామస్వామి, టెస్లా అధిపతి ఎలాన్ మస్క్, జెఫ్ బెజోస్, మార్క్ జుకర్ బర్గ్, టిమ్ కుక్, సుందర్ పిచాయ్ తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్ ప్రతిభా పురస్కారాలు-2024' ప్రకటన

హైదరాబాద్: 'గవర్నర్ ప్రతిభా పురస్కారాలు-2024' అవార్డులను తెలంగాణ గవర్నర్ కార్యాలయం ప్రకటించింది. ఈ అవార్డులకు ఎంపికైన 8 మంది జాబితాను వెల్లడించింది. వివిధ రంగాల్లో సేవలందించిన వ్యక్తులు, సంస్థలకు ఈ అవార్డులను ప్రదానం చేస్తారు. ఈ నెల 26న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ అవార్డులను అందించనున్నారు. ఈ మేరకు గవర్నర్ కార్యాలయ ముఖ్యకార్యదర్శి దాన కిశోర్ ప్రకటన విడుదల చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా నాలుగు రంగాలకు చెందిన వారికి ఏటా పురస్కారాలు ఇవ్వాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నిర్ణయించారు. పర్యావరణ పరిరక్షణ, దివ్యాంగుల సంక్షేమం, క్రీడలు, సాంస్కృతిక విభాగాల్లో గత ఐదేళ్లుగా ఉత్తమసేవలు అందిస్తున్న వారికి గవర్నర్ ప్రతిభా పురస్కారాలు ఇవ్వనున్నారు. సంస్థలు, వ్యక్తులకు వేర్వేరు కేటగిరీల్లో ఈ అవార్డులు ఉంటాయి. అవార్డు కింద రూ.2 లక్షలు , జ్ఞాపిక ఇవ్వనున్నారు. అవార్డుకు ఎంపికైన వారిలో ..దుశర్ల సత్యనారాయణ, అరికపూడి రఘు, పారా ఒలింపిక్ విజేత జీవాంజి దీప్తి, ప్రొఫెసర్ ఎం.పాండురంగారావు, పి.బి.కృష్ణభారతికి సంయుక్తంగా, ధ్రువాంశు ఆర్గనైజేషన్, ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి, ఆదిత్య మెహతా ఫౌండేషన్, సంస్కృతి ఫౌండేషన్ ఉన్నాయి.

# యాదాద్రీశుడి ఆదాయం రూ.4,17,13,596

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.4,17,13,596 లు చేకూరింది.గత 47 రోజులుగా వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు హుండీలలో సమర్పించిన నగదు, నగల కానుకల లెక్కింపు పర్వం దేవస్థానం చేపట్టింది. కొండకింద ఆధ్యాత్మిక వాడలోని శ్రీసత్య నారాయణస్వామి వ్రత మండపంలో సోమవారం చేపట్టిన లెక్కింపులో ఆలయ ఉద్యోగులు,కల్యాణకట్ట సిబ్బంది,అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు,భక్తులు,మహిళా సేవ సమాఖ్య బృందాలు పాల్గొన్నాయి. కొనసాగిన లెక్కింపులో నగదు రూ.4,17,13,596, మిశ్రమ బంగారం 229 గ్రాములు, వెండి7,050 గ్రాములు చేకూరినట్లు ఈవో భాస్కరరావు తెలిపారు. ఎస్పీఎఫ్ జవాన్లు,సీసీ కెమెరాల నిఘా మధ్య ఉదయం నుంచి సాయంత్రం వరకు లెక్కింపు పర్వం కొనసాగింది.

# సంజయ్ రాయ్‌కు జీవిత ఖైదు




న్యాయస్థానం సంజయ్‌ను దోషిగా తేల్చిన సంగతి తెలిసిందే గతఏడాది ఆగస్టు 9వ తేదీ రాత్రి ఆర్జీకర్ ఆసుపత్రి సెమినార్ రూమ్‌లో ఒంటరిగా నిద్రిస్తున్న జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన తీవ్ర నిరసనలకు దారితీసింది. పశ్చిమ బెంగాల్ హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును కోల్‌కతా పోలీసుల నుంచి సీబీఐ స్వీకరించి, విచారించింది. దీనిలో భాగంగా ప్రత్యేక కోర్టుకు అభియోగాలు సమర్పించింది. ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్ పేరును మాత్రమే ఛార్జ్‌షీట్‌లో చేర్చింది. సామూహిక అత్యాచారం విషయాన్ని అభియోగ పత్రంలో ప్రస్తావించలేదు. ఆసుపత్రి ఆవరణలోని సీసీటీవీలో నమోదైన దృశ్యాల ఆధారంగా సంజయ్‌ను ఆగస్టు 10న కోల్‌కతా పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.నాతో బలవంతంగా సంతకాలు చేయించి ఇరికించారు: కోర్టులో ఆర్జీకర్ హత్యాచార దోషి వాదనఇక ఈ కేసులో ఆర్జీకర్ మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్, తాలా పోలీస్ స్టేషన్ మాజీ ఆఫీసర్ ఇన్ ఛార్జి అభిజిత్ మండల్‌ను అరెస్టు చేసింది. సాక్ష్యాలు తారుమారుచేశారన్న ఆరోపణలపై వారు అరెస్టు కాగా.. తర్వాత వారికి ప్రత్యేక న్యాయస్థానంలో బెయిల్ లభించింది. వారు అరెస్టయిన దగ్గరినుంచి 90 రోజుల్లో అనుబంధ ఛార్జ్‌షీట్‌ను ఫైల్ చేయకపోవడంతో ఈ బెయిల్ లభించింది. ఇక సంజయ్‌కు శిక్ష ఖరారు నేపథ్యంలో కోర్టు వద్ద పోలీసులు భారీగా భద్రత ఏర్పాటు చేశారు.

# సీఎం రేవంత్ మాటలు కోటలు.. చేతలు గల్లీ కూడా దాటవు

## రాష్ట్రంలో కనీసం జీతాలు కూడా ఇవ్వలేని స్థితి : హరీశ్‌రావు

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి మాటలు కోటలు దాటుతాయని కానీ చేతలు మాత్రం గల్లీ కూడా దాటదని, ప్రతి నెలా మొదటి తారీఖున ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామన్న సీఎం, మంత్రుల మాటలు నేతి బీరకాయలో నెయ్యిచందంగా మారాయని అనేకసార్లు రుజువయ్యాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకే కాదు.. మహిళల హక్కులను కాపాడే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన మహిళా కమిషన్ సభ్యులకు గత సంవత్సర కాలం నుంచి రేవంత్ రెడ్డి ప్రభుత్వం జీతాలు ఇవ్వడం లేదని తాజాగా నా దృష్టికి వచ్చింది అని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో మహిళా కమిషన్‌కు రూ. 2 కోట్ల 42 లక్షలు కేటాయించినప్పటికీ విడుదల చేసింది రూ. 20 లక్షలకు మించి లేదు. న్యాయమూర్తులతో సమానంగా వ్యవహరించబడే మహిళా కమిషన్ సభ్యులకే జీతాలు చెల్లించలేక పోతే ఈ ప్రభుత్వం సామాన్య మహిళల హక్కులను ఏ విధంగా కాపాడుతుంది..? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. వెంటనే మహిళా కమిషన్ సభ్యుల పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని, ఇక నుంచి మొదటి తారీఖునే మహిళా కమిషన్ సభ్యులకు జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరుతున్నానని హరీశ్‌రావు తెలిపారు.

# మంచు మనోజ్‌కు షాక్

హైదరాబాద్: మంచు మనోజ్‌కు తిరుపతి ఏ రంగంపేట హాస్టల్ యజమానులు షాక్ ఇచ్చారు. తమకు ఎలాంటి సమస్యలు లేవని.. పైగా మోహన్ బాబు విద్యాసంస్థల వల్లే తాము బాగుబడ్డామని తెలిపారు. ఈ మేరకు మంచు మనోజ్‌కు హాస్టల్ యజమానులు లేఖ రాశారు. "మనోజ్ .. మీరు మాకేదో సమస్యలు ఉన్నట్టు అవి మీకు చెప్పినట్లు మీడియాలో మాట్లాడుతున్నారు. హాస్టల్స్ విద్యార్థులకు యాజమాన్యంతో సమస్యలు లేవు.. వర్సిటీల యాజమాన్యంతోనూ విద్యార్థులకు సమస్యలు లేవు. మాకు ఏ సమస్యలు లేవు... ఒకవేళ ఉన్నా వాటిని మోహన్ బాబు, మంచు విష్ణుతో చెప్పుకుంటాం.. వారు మా సమస్యలను సామరస్యంగా పరిష్కరిస్తారు" అని అన్నారు. "మోహన్ బాబు స్థాపించిన విద్యాసంస్థల వల్లే ఈ పాత్రంలో భూముల అభివృద్ధి జరిగింది. పండుగ రోజు మీరు విశ్వవిద్యాలయాల గేటును తన్నటం చూసి ఆశ్చర్యపోయాం.. ఎంతో మందికి ఉద్యోగాలను ఉపాధిని అందించిన విశ్వవిద్యాలయాలవి.. మనోజ్ మీ స్వార్థం కోసం మా బ్రతుకులతో ఆడుకోకండి.. మమల్మి రోడ్డుకి లాగకండి. మీకు, మీ కుటుంబసభ్యులకు సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలి. మా సమస్యలను మీకు చెప్పుకున్నట్లు మీడియాలో ప్రచారం చేయడం సరికాదు. మనోజ్ చెప్పింది పచ్చి అబద్ధం. అత్యంత దారుణం" అంటూ ఏ.రంగంపేట, సాయినాథ్ ప్రైవెట్ హాస్టల్స్ యాజమాన్యం లేఖలో పేర్కొంది. తిరుపతిలోని 39 మంది హాస్టల్స్ ప్రతినిధులు సంతకాలు చేసి లేఖ రాశారు. కాగా..

తిరుపతిలోని మోహన్ బాబు విద్యాసంస్థల్లో విద్యార్థులు సమస్యల్లో ఉన్నారని మంచు మనోజ్ ఎక్కడ మీడియాతో మాట్లాడినా పదేపదే చెబుతున్నారు. తిరుపతి చుట్టుపక్కల ఉన్న హాస్టల్ యజమానులు.. విద్యార్థులను దోచుకుంటున్నారని, పెద్ద మొత్తంలో చార్జీలను వసూలు చేస్తున్నారని, సరైన భోజనం పెట్టడం లేదని మనోజ్ చెప్పుకొచ్చారు. విద్యార్థుల సమస్యలను పట్టించుకోకుండా హాస్టల్స్ సిబ్బందితో యాజమాన్యం కుమ్మక్కై.. హాస్టల్స్ పరిస్థితిపై విద్యార్థులు చెప్పినా.. వారికే చెడు చేసే విధంగా వ్యవహరిస్తున్నారని... హాస్టల్స్ దోపిడీని ప్రశ్నించాలని మనోజ్ చెబుతూ వస్తున్నారు.

# మైనింగ్‌కు వ్యతిరేకంగా గ్రామస్థుల పోరుబాట



తీసింది. అక్రమ అరెస్టులు ఆపాలంటూ గ్రామస్తులు డిమాండ్ చేసారు. గ్రామానికి పోలీసులు రాకుండా కంచె ఏర్పాటు చేశారు. మైలారం గ్రామంలో ఉండే గుట్టపై క్వార్ట్జ్ ఖనిజాలను మైనింగ్ చేసేందుకు అనుమతులు లభించాయి. ఈ నేపథ్యంలో గత కొంత కాలంగా అక్కడ మైనింగ్ జరుగుతోంది. అనుమతుల నియమాలకు వ్యతిరేకంగా ఈ మైనింగ్ జరుగుతోందని పేర్కొంటూ గ్రామస్తులు గత కొద్ది రోజులుగా ఆందోళన చేపట్టారు. మైనింగ్‌పై ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ జరగలేదని, గ్రామ తీర్మానం కూడా ఫేక్‌గా సృష్టించి మైనింగ్ జరుపుతున్నారని గ్రామస్తులు ఆందోళన చేస్తున్నారు.

ఈ ఆందోళన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించేందుకు ఇటీవల హైదరాబాద్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. దీనికి ప్రొఫెసర్ హరగోపాల్ కూడా సంఘీభావం తెలిపారు. దీంతో సోమవారం నుంచి రిలే నిరాహారదీక్షలు చేపట్టాలని గ్రామ సభ తీర్మానించింది. దీనికి హరగోపాల్‌ను ముఖ్య అతిథిగా పిలిచారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు సోమవారం తెల్లవారుజాము 4 గంటలకు గ్రామానికి వచ్చి నిరసనకారులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. మహిళలు గ్రామంలో రోడ్డుకు అడ్డంగా కంచె వేసి పోలీసులు రావద్దంటూ మహిళలు పురుగుల మందు డబ్బాలు పట్టుకుని నిరసన చేపట్టారు. చాలా కాలంగా మైనింగ్‌కు వ్యతిరేకంగా గ్రామస్తులు పోరాటం చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో మైలారం గ్రామంలో సోమవారం తెల్లవారుజాము నుంచి ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. మైలారం మైనింగ్ వెలికితీత కార్యక్రమాన్ని నిలిపివేయాలని గత మూడు నెలలుగా ఆ గ్రామస్తులు శాంతియుత పోరాటం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మైలారం గ్రామ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో రైతులు, ప్రజలు

రిలే నిరాహార దీక్షలకు పూనుకున్నారు. దీంతో పోలీసులు గ్రామానికి చేరుకొని మహిళలను, రైతులను

అరెస్ట్ చేశారు. అలాగే అచ్చంపేటలో ఉన్న మైలారం గ్రామ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడిని కూడా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది.

# కవితమ్మ డాక్టర్‌కు చూపించుకుంటే మంచిది

సంగారెడ్డి: పసుపు బోర్డు తమ వల్లే వచ్చిందన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సెటైర్లు వేశారు. కవిత మంచి డాక్టర్ కు చూపెట్టుకుని తర్వాత మాట్లాడాలని సూచించారు. జైల్లో ఉన్నప్పుడు కవిత ఆరోగ్యం బాగోలేదని వార్తలు వచ్చాయి... చెల్లె కవిత ఇప్పటికి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతుంది... మంచి డాక్టర్ కి చూపిస్తే ఆమె ఆరోగ్యం బాగుపడుతుంది. ఆ తర్వాత ప్రెస్ మీట్ పెడితే బాగుంటుందని రఘునందన్ రావు అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్ కి రైతులు ఎందుకు గుర్తుకు రాలేదని రఘునందన్ రావు ప్రశ్నించారు. ఎర్రవల్లి ఫామ్ హౌస్ చుట్టూ ఉన్న గ్రామాల్లో రైతులు ఆత్మహత్య చేసుకున్నప్పుడు కేటీఆర్ ఎందుకు స్పందించలేదు. అధికారం పోయాక రైతులపై కేటీఆర్ కి ప్రేమ పెరిగి రైతు ధర్నాలు చేస్తున్నాడని విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ హయాం లోనే అంబేద్కర్ కి అవమానం జరిగింది. కాంగ్రెస్ ఐదున్నర దశాబ్దాలు అధికారంలో ఉండి ఏనాడూ అంబేద్కర్ ని గౌరవించలేదు.కేవలం అంబేద్కర్ జయంతి, వర్ధంతులు తప్ప కాంగ్రెస్ పార్టీ చేసింది ఏమి లేదు. 1950 లో నామినేటెడ్ ప్రధానిగా ఉన్నప్పుడే జవహర్ లాల్ నెహ్రూ రాజ్యాంగానికి తూట్లు పొడిచారు. రెండోసారి ప్రధానిగా ఇందిరాగాంధీ ఎమ్జ్గ÷న్సీ తీసుకువచ్చి రాజ్యాంగాన్ని తుంగలో తొక్కారని రఘునందన్ రావు విమర్శించారు.

# రికార్డు సృష్టించిన డేర్‌డెవిల్స్ టీమ్

న్యూఢిల్లీ: ఈ నెల 26న జరిగే 76వ గణతంత్ర దినోత్సవాలకు దేశ రాజధాని నగరంలోని కర్తవ్యపథ్ ముస్తాబవుతోంది. ఈ వేడుకలకు విదేశీ ప్రముఖులతోపాటు పారాలింపిక్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు, ఉత్తమ పని తీరు కనబరచిన గ్రామాల సర్పంచ్‌లు, చేనేత కళాకారులు, అటవీ, వన్య ప్రాణి సంరక్షకులు ఇలా దాదాపు 10,000 మంది ప్రత్యేక అతిథులను కేంద్రం ఆహ్వానించింది. ఇక గణతంత్ర వేడుకల్లో భాగంగా భారత ఆర్మీ ఇప్పటికే పలు విన్యాసాలు చేస్తోంది. ఈ క్రమంలో భారత ఆర్మీకి చెందిన డేర్‌డెవిల్స్ టీమ్ సరికొత్త రికార్డు సృష్టించింది. కదులుతున్న బైక్స్‌పై అత్యంత ఎత్తైన మానవ పిరమిడ్ (20.4 అడుగులు)ను నిర్మించి ప్రపంచ రికార్డు సృష్టించింది. తద్వారా అసాధారణమైన ఫీట్‌ను సాధించింది. ఏడు మోటార్ సైకిళ్లపై 40 మంది 2 కిలోమీటర్ల మేర ప్రయాణించడం ద్వారా ఈ ఘనతను అందుకుంది. ఆర్మీలోని మోటార్ సైకిల్ రైడర్ డిస్‌ప్లే టీమ్‌ను 'డేర్ డెవిల్స్' అని పిలుస్తారు. ఈ టీమ్‌కు సుదీర్ఘ చరిత్ర ఉంది. అంతేకాదు.. తమ ప్రదర్శనలతో అంతర్జాతీయ ప్రశంసలు కూడా అందుకుంది. ఈ టీమ్ ఇప్పటికే ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ సహా 33 ప్రపంచ రికార్డులను సొంతం చేసుకుంది. 1935 నుంచి ఇప్పటి వరకూ డేర్‌డెవిల్స్ టీమ్.. గణతంత్ర దినోత్సవ పరేడ్‌లు, ఆర్మీ డే పరేడ్‌లు సహా ప్రతిష్టాత్మక కార్యక్రమాల్లో దాదాపు 1,600 మోటార్ సైకిల్స్ ప్రదర్శనలు ఇచ్చి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

# సఫాయి అన్నకు సలాం కొట్టిన ఒకే ఒక్కడు కేసీఆర్



హైదరాబాద్:ఈ రాష్ట్రంలో పని చేసే కార్మికుల అభివృద్ధి కోసం నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ తెలిపారు. సఫాయి అన్న.. నీకు సలాం అన్న సీఎం ఈ దేశంలో ఎవరూ లేరు.. కేవలం కేసీఆర్ మాత్రమే అని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్ హమాలీలు, ఆటో డ్రైవర్ల కోసమే కాదు.. అందరి కోసం పని చేశారు. కార్మికుల ఇబ్బందులు, చికాకులు పరిష్కరించేందుకు కేసీఆర్ ఎంతో కృషి చేశారు. జీహెచ్ఎంసీలో సఫాయి కార్మికులకు మూడు సార్లు జీతాలు పెంచారు. తెలంగాణ ఏర్పడక ముందు నాటి ప్రభుత్వాలు అంగన్‌వాడీ టీచర్లను గుర్రాలతో తొక్కించారు. కానీ కేసీఆర్ ప్రభుత్వం వారిని పెద్ద మనసుతో ఆశీర్వదించింది. అంగన్‌వాడీల జీతం రూ. 4500 ఉంటే రూ. 13650కు పెంచారు. మినీ అంగన్‌వాడీలకు రూ. 2200 ఉంటే రూ.7800 చేశారు. ఇటీవల హైదరాబాద్ నగరంలో ఆశా వర్కర్ల పట్ల పోలీసుల అసభ్యంగా ప్రవర్తించారు. సీఎం రేవంత్ రెడ్డి మాదిరిగానే పోలీసులు కూడా ప్రవర్తించారు. ఆశావర్కర్లకు జీతాలు రూ. 2500 ఉంటే రూ. 9750 దాకా తీసుకువెళ్లాం. ఉపాధి హామీలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్లకు కూడా జీతాలు పెంచినం. అన్ని రంగాల్లో పని చేసే కార్మికులను గుండెల్లో పెట్టుకున్నామని కేటీఆర్ తెలిపారు. హోంగార్డుల విషయం బాధాకరం. మొన్న ఒక హోంగార్డు కలిసి కళ్లల్లో నీళ్లు పెట్టుకున్నడు. రూ. 9 వేలు ఉండే జీతాన్ని రూ. 25 వేలు చేసిండు కేసీఆర్.. ఆయన దేవుడు. ఎందుకు ఓడగొట్టారు. ఆయన ఉంటే మాకు ఇంకా లాభం జరిగేది. పోలీసులతో సమానంగా పే స్కేలు వచ్చేది.. మూడు పూటల అన్నం తింటున్నాం అంటే కేసీఆర్ పుణ్యమే అని ఆ హోంగార్డు చెప్పి బాధపడ్డాడని కేటీఆర్ గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కంటే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 73 శాతం వేతనాలు పెంచారు. దేశంలో అత్యధిక జీతాలు పొందుతున్న ఉద్యోగులు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులే. ఇది చిన్న విషయం కాదు. కాంట్రాక్టర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పీఆర్సీ వర్తింపజేశాం. అలాగే నాలుగున్నర లక్షల మంది బీడీ కార్మికులకు పెన్షన్లు ఇచ్చాం. 26 లక్షల మంది ప్రయివేటు డ్రైవర్లకు 5 లక్షల జీవిత బీమా ఇచ్చారు కేసీఆర్. వైద్య రంగం, మున్సిపల్ రంగంలో జీతాలు పెంచుకుంటూ పోయామని కేటీఆర్ తెలిపారు.

# దావోస్ పర్యటనలతో సాధించేదేమిటి ?

దావోస్‌లో ప్రపంచ పెట్టుబడుల సదస్సుకు ఇరు తెలుగు రాష్ట్రాల సిఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడులు వెళ్లారు. పెట్టుబడులే లక్ష్యంగా వీరు అడుగులు వేస్తున్నారు. హైదరాబాద్‌కు ఉన్న బ్రాండ్‌తో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇది ఆయనకు రెండో పర్యటనగా కలిసివస్తుందేమో చూడాలి. చంద్రబాబుకు ప్రపంచంలో సొంత బ్రాండ్ ఇమేజ్ ఉంది. అమరావతి కొత్త రాజధానిగా అవతరించినందున ఆయనకు సానుకూలత కాగలదు. అయితే ఇదంతా ఒక ఎత్తయితే.. సింగపూర్‌లా రాష్ట్రాలను అభివృద్ధి చేసేందుకు స్థానికంగా ఉన్న యువతకు ప్రోత్సాహం ఇవ్వాల్సి ఉంటుంది. స్థానిక వనరులు, స్థానిక యువతను ప్రోత్సహిస్తే ఆదాయవనరులు కూడా పెరగగలవు.

కానీ మేక్ ఇన్ ఇండియా అంటున్న ప్రధాని కూడా పెద్ద ఎత్తున ఈ రకమైన ప్రోత్సాహం ఇవ్వడం లేదు. దేశీయంగా యువతకు ఉపాధి కల్పించడానికి బ్యాంకులను ప్రోత్సహించాలి. విరివిగా రుణాలు ఇవ్వాలి. వ్యవసాయం, వ్యవసాయాధిరత పరిశ్రమలు, కోళ్లు, పశువులు, గొర్లు, మేకల పెంపకం వంటి వాటికి అవసరమైతే వడ్డీరహిత రుణాలను ఇవ్వగలగాలి. యువత విదేశాలవైపు చూడకుండా ఉండాలంటే ఇలాంటి స్వయం ఉపాధి రంగాలను ప్రోత్సహించాల్సి ఉంటుంది. విదేశీ కంపెనీలను, పెట్టుబడులను ఆహ్వానించి పెద్ద ఎత్తున ఏదో చేయాలన్న ఆలోచన కూడా సరికాదు. ప్రభుత్వ రంగాన్ని, ఉద్యోగులను కుదించడం, సంక్షేమాన్ని వదిలేసి యూజర్ ఛార్జీలు వసూలు చేయడం ఇలాంటి వాటిని కొత్తగా పాలసీలు, విజన్ పేరుతో అమలు చేసేందుకు ఎపిలో కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. రెగ్యులేటరీ కమిషన్లు, ప్రైవేటీకరణకు వీలుగా ప్రత్యేక వ్యవస్థలు ఏర్పాటు చేయబోతు న్నారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వ పాలనలో అన్నిటిలోనూ ప్రపంచబ్యాంకు విధానాలు గోచరిస్తున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. స్వర్ణాంధ్ర విజన్ 2047, వివిధ రంగాలపై తీసుకొచ్చిన సుమారు 22 పాలసీల్లో గతంలో ప్రపంచబ్యాంకు ఏదైతే చెప్పిందో వాటిని మళ్లీ వేర్వేరు రూపాల్లో తిరిగి తెస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే అవి ఎలా వున్నా.. స్థానికంగా ఉన్న వనరులతో స్థానిక యువతను ప్రోత్సహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి. తక్కువ పెట్టుబడులతో పెద్ద మొత్తంలో ఉపాధికి అవకాశాలను అన్వేషించాలి. విదేశీ పెట్టుబడులు అనగానే ముఖ్యంగా విద్యుత్, నీటిని వ్యాపారం చేయడం, అడిగిన వారికి భూములు అప్పగించడం, పట్టణ ప్రాంతాల్లో పెద్దపెద్ద వ్యాపార సంస్థలకు అనువుగా అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని సవరించడం, వ్యవసాయంలో యాంత్రీకరణ పెంచడం, ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్యను తగ్గించడం, విదేశీ వ్యాపార సంస్థలకు ఎటువంటి అడ్డంకులూ లేకుండా చేయడం వంటి అంశాలు తునమీదకు వస్తున్నాయి. మరీ ముఖ్యంగా వ్యవసాయ భూములను పారిశ్రామిక ప్రాంతాలుగా మార్చడం, ఆహార పంటల స్థానంలో వాణిజ్య పంటలు పెంచడం, ఆహార ఉత్పత్తులను తగ్గించడం ఇవన్నీ కూడా ఆందోళనకర అంశాలు మారుతున్నాయి. ప్రధానంగా వ్యయసాయ భూములను బలవంతంగా లాక్కుని కార్పోరేట్లకు కట్టబెడు తున్నారు. ఇలాంటి పరిస్థితి పోవాలి. కొత్తగా తీసుకొచ్చే పరిశ్రమలు, పారిశ్రామిక పాలసీల్లో లక్షల మందికి ఉపాధి కల్పన ఉంటుందని పేర్కొంటున్నారు. కానీ ఎక్కడా అలాంటిదేమీ కనిపించడం లేదు. విదేశీ పెట్టుబడులకు దాసోహమంటూ ఇక్కడి వనరులను దోచిపెడుతున్న పాలకులు దేశీయంగా యువత ముందుకు వస్తే మాత్రం..ఓ పైసా వడ్డీకూడా తగ్గించడం లేదు. ఉచిత విద్యుత్ ఇవ్వరు. భూమలు ఇవ్వరు. నీరు ఇవ్వరు. దీనిని బట్టి ప్రపంచీకరణ ప్రభావంతో దేశంలో విదేశీయుల పెత్తనం పెరగిపోవడం ఖాయం. అదే సమయంలో ఉత్పాదకతలో సాంకేతికతను పెంచాల్సి ఉంది. ఆధునీకరణ పేరిట ఇప్పటికే ఉన్న

ఉపాధి పోతుంటే కొత్త ఉపాధి వస్తుందని మభ్యపెట్టడం తప్ప మరొకటి కాదు. వ్యవసాయంలో యాంత్రీకరణ, పారిశ్రామిక ఆధునీకరణ అవసరమే. అయితే అది ఉన్న ఉపాధిని దెబ్బతీయకుండా చూసుకోవాలి. సంస్కరణల్లో భాగంగా ఉద్యోగాలను ప్రైవేటుపరం చేయడం ద్వారా ఖర్చును తగ్గించుకోవాలని కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వాలు చూస్తున్నాయి. తమపై భారం లేకుండా చూడాలని చూస్తున్నారు. జీతాలు, పెన్షన్లు తగ్గించుకోవాలన్న క్రమంలో ప్రైవేట్ పెట్టుబడులకు పెద్దపీట వేస్తున్నారు. దావోస్ లాంటి సదస్సులు ఇందుకు వేదికగా మారుతున్నాయి. ప్రభుత్వం ప్రైవేటు ఇండిస్ట్రియల్ పార్కులు తెచ్చి

రైతులు నేరుగా వారికి భూములు అప్పగించొచ్చనీ ప్రకటించడమే కాకుండా రాయితీలూ ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నది. గతంలో తీసుకొచ్చిన సరళీకరణ విధానాల్లో పారిశ్రామిక అవసరాలకు తగిన విధంగా భూములు కేటాయింపులు జరపాలనేది కీలకమైన షరతు. దీన్ని ఇప్పుడు పాలసీ రూపంలో ముందుకు తీసుకొచ్చారు. అయితే ఇదంతా చేసే బదులు ఎవరికి వారు స్వయం ఉపాధి రంగాన్ని ఎంచుకుంటే బ్యాంకు రుణాలు, నీటి సదుపాయాలు, విద్యుత్ సౌకర్యాలు ఇస్తే దేశీయంగానే చిన్నచిన్న పరిశ్రమలు స్థాపన సులువు కాగలదు. దానికి దావోస్ లాంటి సదస్సులకు వెళ్లడం, వెంపర్లాడడం, బతిమాడడం వంటివన్నీ చేయకుండానే లక్ష్యం నెరవేర్చుకోగలం. కేవలం ఉన్న మానవ వనరులను,సహజ వనరులను ఉపయోగించుకుంటే మంచిది. అలాంటి ప్రయత్నాలు మొదలు కావాలి.

వేగుచుక్క

## రేట్లు తగ్గించేందుకు..

గత ఏడాది క్రితం 24 క్యారెట్ల బంగారం రేటు రూ. 58,500 వద్ద ఉండగా అది ఇప్పుడు రూ. 78,700 దాటింది. అందుకు చాలా కారాణాలు ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ధరల పెరుగుదల, భౌగోళిక పరిస్థితులు, దేశాల మధ్య ఉద్రిక్తతలు, కేంద్ర బ్యాంకుల పాలసీల వంటివి చాలా అంశాలు ఉంటాయి. ఇక పండగలు, పెళ్లిళ్లు, శుభకార్యాల వంటి ప్రత్యేక సందర్భాల్లో గిరాకీ పెరిగి బంగారం ధరలు మరింత పెరుగుతా యి. ఈ క్రమంలో బంగారం ధరల అంశం లోక్‌సభను తాకింది. బంగారం ధరలు తగ్గిం చేందుకు కేంద్రం ఏమైనా చర్యలు చేపట్టిం దా? అని ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సమాధానమిచ్చారు. ‘ కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే యూనియన్ బడ్జెట్ 2024-25 లోనే బంగారం దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీని 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గించింది. బంగారం, ఆభారణాల లో దేశీయ విలువ జోడింపును పెంపొం దించడం, వినియోగదారులకు బంగారాన్ని మరింత సరసమైన దిగా చేయడమే ఈ నిర్ణయం లక్ష్యం.’ అని తెలిపారు. బంగారం ధరల పెరుగుదలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిశీలిస్తోందని తెలిపారు కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి. కానీ, పండగల డిమాండ్‌పై ధరల పెరుగుదల ప్రభావంపై ఎలాంటి కచ్చితమైన అంచనాలు వేయలేదని పేర్కొన్నారు. అలాగే బంగారం ధరల కట్టడి చర్యలు చేపట్టాలనే ఎలాంటి ప్రణాళికలు లేవని స్పష్టం చేశారు.

## జనవరి 31 వరకు గడువు పెంపు..




ప్రత్యక్ష పన్ను వివాదాల్ని పరిష్కరించుకునేందుకు అవకాశం కల్పించేలా తీసుకొచ్చిన వివాద్ సే విశ్వాస్ పథకం కింద ట్యాక్స్ సమస్యల పరిష్కారానికి ఇచ్చిన గడువును మరోసారి కేంద్రం పొడిగించింది. డిసెంబర్ 31వ తేదీ వరకు ఉన్న గడువును జనవరి 31 వరకు పొడిగిస్తున్నట్లు ఆదాయపు పన్ను శాఖ సోమవారం ఓ ప్రకటన చేసింది. ఆ వివరాలు ఇప్పుడే మనం తెలుసుకుందాం.

ప్రత్యక్ష పన్ను చెల్లింపులకు సంబంధించి ఆదాయపు పన్ను శాఖ మరోసారి కీలక నిర్ణయం తీసుకుంది. తక్కువ మొత్తంలో ట్యాక్స్ చెల్లించేందుకు పన్ను చెల్లింపుదారులకు మరో అవకాశం కల్పించింది. ప్రత్యక్ష పన్ను చెల్లింపుల వివాదాల పరిష్కారం కోసం తీసుకొచ్చిన వివాద్ సే విశ్వాస్ స్కీమ్- 2024 గడువును పొడిగిస్తున్నట్లు ఇన్‌కమ్ ట్యాక్స్ విభాగం ప్రకటించింది. డిసెంబర్ 31తో ముగుస్తున్న ఈ గడువును జనవరి 31, 2025 వరకు పొడిగిస్తున్నట్లు సోమవారం ఓ ప్రకట చేసింది. దీంతో ఆదాయపు పన్ను చెల్లింపులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి మరో అవకాశం లభించినట్లయింది. ఒక వేళ గడువు పొడిగించకుంటే స్కీమ్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు 10 శాతం అదనపు ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇప్పటి వరకు వివాద్ సే విశ్వాస్ స్కీమ్ 2024కి దరఖాస్తు చేసుకోని ట్యాక్స్ పేయర్లకు ఇది బిగ్ రిలీఫ్ అని పన్ను అధికారులు చెబుతున్నారు.

‘ఇన్‌కమ్ ట్యాక్స్ చట్టం 1961లోని సెక్షన్ 90లోని టేబుల్ కాలమ్ 3 ప్రకారం చెల్లించాల్సిన పన్నును నిర్ధారించేందుకు డైరెక్ట్ ట్యాక్స్ వివాద్ సే విశ్వాస్ స్కీమ్ 2024 గడువును డిసెంబర్ 31, 2024 నుంచి జనవరి 31, 2025కు పొడిగిస్తున్నాం. డైరెక్ట్ ట్యాక్స్ వివాద్ సే విశ్వాస్ స్కీమ్ 2024లోని సెక్షన్ 97, సబ్ సెక్షన్ 2కి దఖలు పడిన అధికారల మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్స్ సీబీడీటీ ఈ నిర్ణయం తీసుకుంది.’ అని డిసెంబర్ 30, 2024 రోజున ఓ సర్క్యూలర్ జారీ చేసింది ఆదాయపు పన్ను శాఖ.

వారిపై 10 శాతం అదనపు పన్ను

వివాద్ సే విశ్వాస్ స్కీమ్ 2024 కోసం దరఖాస్తు చేసుకునేందుకు జనవరి 31, 2025 వరకు అవకాశం లభించింది. ఆలోపు అప్లై చేసుకున్నట్లయితే ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 90 టేబుల్ కాలమ్ 3 ప్రకారం పన్ను ఎంత చెల్లించాలి అనేది నిర్ణయిస్తారు. కానీ, ఫిబ్రవరి 1, 2025 తర్వాత దరఖాస్తు చేసుకున్నట్లయితే కాలమ్ 4 నిబంధనల ప్రకారం పన్ను లెక్కింపు చేస్తారు. జనవరి 31లోపు దరఖాస్తు చేస్తే వివాదంగా మారిన పన్ను, వడ్డీ, పెనాల్టీ (కొత్త అప్పిలేట్ ప్రకారం)తో మొత్తంగా 100 శాతం మాత్రమే వివాదం ఉన్న ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. అదే ఫిబ్రవరి 1 తర్వాత అయితే అదనంగా 10 శాతం అంటే 110 శాతం ట్యాక్స్ చెల్లించాల్సి వస్తుంది. అదే పాత అప్పిలేట్ నిబంధనల ప్రకారం అయితే ఫిబ్రవరి నుంచి 20 శాతం అదనంగా ట్యాక్స్ చెల్లించాల్సి వస్తుంది.

వివాద్ సే విశ్వాస్ స్కీమ్ 2024లో రెండు ఫారాలు ఉంటాయి. ఫారమ్-1 అనేది ట్యాక్స్ పేయర్లు తమ సమస్యను ఏ విధంగా పరిష్కరించాలనుకుంటున్నామే తెలిపేందుకు ఉపయోగిస్తారు. ఇక ఫారమ్-2 అనేది ఫారం 1 ప్రకారం ఆదాయపు పన్ను శాఖ జారీ చేసే సెటిల్మెంట్ సర్టిఫికెట్. ట్యాక్స్ పేయర్లు విజయవంతంగా ట్యాక్స్ చెల్లింపులు చేసిన తర్వాత దీనిని జారీ చేస్తారు. జనవరి 31వ తేదీలోపు ఫారమ్ 1 సబ్మిట్ చేసినట్లయితే వారు అదనంగా 10 శాతం ట్యాక్స్ చెల్లించనక్కర్లేదు. అయితే, ఫారమ్ 2 జారీ చేసిన 15 రోజుల్లోపు అందులో సూచించిన ట్యాక్స్ మొత్తం చెల్లించాల్సి ఉంటుంది.

## క్రెడిట్ కార్డుతో రెంట్ కడితే..

ప్రస్తుతం డిబిట్ కార్డుల కంటే క్రెడిట్ కార్డుల వినియోగం భారీగా పెరిగినట్లు పలు నివేదికలు చెబుతున్నాయి. బ్యాంకులు సులభంగా క్రెడిట్ కార్డులు జారీ చేస్తుండడం, పలు ప్రత్యేక ప్రయోజనాలు ఉండడం వంటి కారణాలతో ఎక్కువ మంది వీటిని తీసుకుంటున్నారు. ఇక షాపింగ్, డైనింగ్, బిల్ పేమెంట్లకు విరవిగా వాడేస్తున్నారు. అయితే ఈ మధ్య కాలంలో ఇంటి అద్దె చెల్లింపులకు సైతం క్రెడిట్ కార్డు వినియోగిస్తున్నారు. నగదు కొరత ఉన్న సందర్భంలో క్రెడిట్ కార్డులు వినియోగించుకోవడం సహజమే. కానీ, కొందరు చేతిలో డబ్బులు ఉన్నా రెంట్ పేమెంట్ ఆప్షన్ వినియోగించుకుంటున్నారు. మరి రెంట్ పేమెంట్ల కోసం క్రెడిట్ కార్డులు ఉపయోగిస్తే ఎలాంటి లాభనష్టాలు ఉంటాయో తెలుసుకుందాం.

క్రెడిట్ కార్డుతో రెంట్ పే చేస్తే లాభాలు..

రెంట్ పేమెంట్ చేసేటప్పుడు క్రెడిట్ కార్డులను బట్టి క్యాష్ బ్యాక్‌లు, ట్రావెల్ పాయింట్లు వంటి రివార్డ్స్ లభిస్తాయి. అయితే, కార్డు, బ్యాంకును బట్టి మారుతుంటాయి. క్రెడిట్ కార్డు ద్వారా పెమెంట్ చేసి ఆ బిల్లు చెల్లించేందుకు 20- 45 రోజుల వరకు గడువు ఉంటుంది. ఎలాంటి వడ్డీ ఉండదు. ఈలోగా తిరిగి చెల్లించేస్తే సరిపోతుంది. ఆ వ్యవధిలో చేతిలో ఉన్న డబ్బులను ఇతర అవసరాలకు వాడుకోవచ్చు. క్రమంగా క్రెడిట్ కార్డు ద్వారా రెంట్ చెల్లిస్తే దీర్ఘకాలంలో మంచి క్రెడిట్ స్కోర్ నిర్మించుకునే అవకాశం ఉంటుంది. చేతిలో డబ్బులు లేని సమయంలో క్రెడిట్ కార్డ్ రెంట్ పేమెంట్ ఆప్షన్ ఉపయోగపడుతుంది. దీంతో ఇంటి ఓనర్‌కు సకాలంలో రెంట్ ఇచ్చినవారమవుతాం.

**ఈ నష్టాలూ ఉంటాయ్..**

క్రెడిట్ కార్డు ద్వారా రెంట్ పేమెంట్ చేస్తే థర్డ్ పార్టీ యాప్స్ కొంత ఛార్జీలు వసూలు చేస్తుంటాయి. దీంతో పాటు కొన్ని బ్యాంకులు సైతం రెంట్ పేమెంట్లపై 1 శాతం మేర ఫీ వసూలు చేస్తున్నాయి. ఇది అదనపు భారమేనని చెప్పాలి. ఇక రెంట్ చెల్లించి ఏదైనా కారణంతో సకాలంలో క్రెడిట్ కార్డ్ బిల్లు చెల్లించకపోతే దాదాపు 30-42 శాతం వరకు వడ్డీ పడుతుంది. మరోవైపు క్రెడిట్ స్కోర్ లెక్కించడంలో క్రెడిట్ యుటిలైజేషన్ రేషియో కీలకంగా మారుతుంది. అది 30 శాతం లోపే ఉండాలని నిపుణులు సూచిస్తుంటారు. ఒక వేళ రెంట్ పేమెంట్లతో పెద్ద మొత్తంలో పేమెంట్లు చేస్తే యుటిలైజేషన్ రేషియోపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు. సీయూఆర్ రేషియో 30 శాతం మించితే క్రెడిట్ స్కోర్ పై ప్రభావం పడుతుంది. అలాగే క్రెడిట్ కార్డు ఉంది కదా అని చేతిలో ఉన్న డబ్బులను ఇతర అవసరాలకు వాడుకుంటుంటారు. దీంతో ఆర్థిక క్రమ శిక్షణ దెబ్బతింటుంది.

క్రెడిట్ కార్డుతో రెంట్ పేమెంట్ చేసేటప్పుడు ఎలాంటి లాభాలు ఉన్నాయి? నష్టాలను మించే రివార్డులు లభిస్తున్నా యా? అనే విషయాలు చూడాలి. మంచి రివార్డులు వస్తాయని అనుకుంటేనే రెంట్ పేమెంట్ చేయడం మంచిది. నగదు లేని సందర్భాల్లో, క్రెడిట్ కార్డ్ టార్గెట్ చేరుకునేందుకు వాడితే ప్రయోజనకరమే. కానీ, డబ్బులు అవసరమైన ప్రతి సారీ క్రెడిట్ కార్డు వాడేస్తే అప్పుల ఊబిలో కూరుకుపోవచ్చు. క్రెడిట్ కార్డును ఎంతో క్రమశిక్షణగా ఉపయోగించాలి. అప్పుడే ప్రయోజనం పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.

## సుకన్య సమృద్ధి ఇన్వెస్టర్లకు బ్యాడ్‌న్యూస్..



చిన్న మొత్తాల పొదుపు పథకాలకు సంబంధించి కేంద్రం కీలక ప్రకటన చేసింది. ప్రస్తుత త్రైమాసికం డిసెంబర్ 31తో ముగిసిన నేపథ్యంలో.. జనవరి- మార్చి త్రైమాసికానికి గానూ ఈ పథకాల వడ్డీ రేట్లను ప్రకటించింది. ఇందులో సుకన్య సమృద్ధి యోజన, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ సీనియర్ సిటిజెన్స్ సేవింగ్స్ స్కీమ్స్ వంటివి ఉన్నాయి. చివరగా 2023 డిసెంబర్ నెలలో .. జనవరి- మార్చికిగానూ రెండు పథకాల వడ్డీ రేట్లు పెంచింది. మనం పెట్టుబడులు పెట్టేందుకు ఎన్ని ఆప్షన్లు ఉన్నా.. ఇప్పటికీ పోస్టాఫీస్ పథకాలు లేదా స్మాల్ సేవింగ్స్ స్కీమ్స్‌లో ఇన్వెస్ట్ చేసే వారి సంఖ్య ఎక్కువే. ఇక్కడ కేంద్ర ప్రభుత్వ మద్దతు ఉంటుంది. నిర్దిష్ట వడ్డీ రేటు ప్రకారం గ్యారెంటీ రిటర్న్స్ వస్తాయి. ఎలాంటి రిస్క్ ఉండదని చెప్పొచ్చు. చిన్న మొత్తాల్లో కూడా డిపాజిట్లు చేయొచ్చు. లాంగ్ రన్‌లో పెద్ద మొత్తంలో రిటర్న్స్ అందించే ఎన్నో స్కీమ్స్ ఇందులో ఉన్నాయి. ఇంకా ప్రతి 3 నెలలకు ఓసారి ఇక్కడ వడ్డీ రేట్లను కేంద్రం సమీక్షించి.. పెంచడం లేదా తగ్గించడం లేదా స్థిరంగా ఉంచడం చేస్తుం టుంది. ఈ క్రమంలోనే తాజాగా.. అక్టోబర్- డిసెంబర్ త్రైమాసికం ముగిసిన నేపథ్యంలో.. జనవరి- మార్చి క్వార్టర్‌కు గానూ.. ఈ పోస్టాఫీస్ పథకాల కొత్త వడ్డీ రేట్లను ప్రకటించింది. అయితే మరోసారి నిరాశే ఎదురైంది. వడ్డీ రేట్లను యథాతథంగానే ఉంచింది. దీంతో వడ్డీ రేట్లు పెరుగుతాయని ఆశలు పెట్టుకున్న వారికి మరోసారి నిరాశ ఎదురైంది. ఈ పోస్టాఫీస్ పథకాల్లో పబ్లిక్ ప్రావిడెంట్ అత్యంత ఆదరణ పొందిందని చెప్పొచ్చు. దీంట్లో వడ్డీ రేటు మాత్రం ప్రస్తుతం వార్షిక ప్రాతిపదికన 7.10 శాతంగా ఉంది. ఇది ఎప్పటినుంచో పెరుగుతుందన్న వాదన వినిపించినా.. పెరగట్లేదు. కొత్త సంవత్సరం వేళ ఇక్కడ వడ్డీ రేట్లు పెరుగుతాయని చూసిన వారికి నిరాశే కలిగింది. చివరిసారి కేంద్రం.. 2024 జనవరి- మార్చి త్రైమాసికంలో సుకన్య సమృద్ధి పథకం, మూడేళ్ల టెన్యూర్ పోస్టాఫీస్ టైమ్ డిపాజిట్ పథకం రేట్లను మాత్రమే పెంచింది. తర్వాత అప్పటినుంచి దాదాపు ఏడాది గడుస్తున్నా ఒక్క పథకం వడ్డీ రేటును కూడా మార్చలేదు.

‘పీపీఎఫ్, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్, సుకన్య సమృద్ధి యోజన వంటి స్మాల్ సేవింగ్స్ స్కీమ్స్ వడ్డీ రేట్లు.. జనవరి- మార్చి క్వార్టర్‌కు యథాతథంగానే ఉండనున్నాయి.’ అని కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ, ఆర్థిక మంత్రిత్వ శాఖ చెప్పినట్లు పీటీఐ ద్వారా తెలిసింది.

మరోవైపు ఆడపిల్లల కోసం ప్రత్యేకంగా అందుబాటులో ఉన్న సుకన్య సమృద్ధి యోజన సహా సీనియర్ సిటిజెన్ల కోసం ఉన్న సీనియర్ సిటిజెన్స్ సేవింగ్స్ స్కీమ్ వడ్డీ రేట్లు ప్రస్తుతం 8.20 శాతంగా ఉండగా.. ఇదే అత్యధికం అని చెప్పొచ్చు. అయితే కొన్ని త్రైమాసికాలుగా ఈ పథకాల్లో వడ్డీ రేట్లు ఏం మారట్లేదు. పీపీఎఫ్‌లో ఆర్థిక సంవత్సరంలో కనీసం రూ. 500 ఇన్వెస్ట్ చేయొచ్చు. వరుసగా 15 ఏళ్లు కట్టాలి. సుకన్య సమృద్ధి యోజనలో మాత్రం రూ. 250 తోనే అకౌంట్ తెరవొచ్చు. వీటిల్లో గరిష్టంగా రూ. 1.50 లక్షల వరకు ఇన్వెస్ట్ చేయొచ్చు. లో కూడా కనీసం రూ. 1000 ఉంటే చాలు. గరిష్టంగా రూ. 30 లక్షల వరకు ఇన్వెస్ట్ చేయొచ్చు. పాత పన్ను విధానంలో వీటిల్లో ఆర్థిక సంవత్సరంలో గరిష్టంగా రూ. 1.50 లక్షల వరకు ఆదా చేసుకోవచ్చు.

## ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలి.

**బకాయిలు చెల్లించకపోతే కాలేజీలు నడపలేం.**

**కలెక్టర్ కు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల వినతి.**



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 20:**

ప్రభుత్వం గత మూడు సంవత్సరా లుగా బకాయి పడ్డ ఫీజు రీయింబ ర్స్మెంట్ డబ్బులను విడుదల చేయాల ని ప్రైవేట్ కళాశాలల యాజమా న్యాలు డిమాండ్ చేశారు. లేదంటే కాలేజీల నిర్వహణ తమతో కాదని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వేల మంది విద్యార్థులకు ఉచితంగా చదువు చెప్పిన తమకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చెయ్యకుండా జాప్యం చెయ్యడం న్యాయం కాదని అన్నారు. గత సంవత్సర కాలం నుండి సిబ్బంది జీతభత్యాలు కూడ చెల్లించలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు.

భవనాల అద్దెలు కూడ చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వ దృష్టికి తమ సమస్యలను తీసుకు వెళ్లాలని కలెక్టర్ కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు డిగ్రీ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షులు హరిప్రసాద్, కార్యదర్శి సంజీవ్, సూర్యప్రకాష్, నరాల సుధాకర్, శ్రీనివాస్, అరుణ్, రమణ, నవీన్, రవి పటేల్, షేక్ రషీద్, గంగాధర్ రాజేందర్ హరికృష్ణ పాల్గొన్నారు.

## ప్రాణాలు తీసిన పబ్జీ..

పబ్జీ గేమ్ ముగ్గురు పిల్లల ప్రాణాలు తీసింది. రైలు పట్టాలపై కూర్చొని.. చెవిలో హెడ్‌ఫోన్స్ పెట్టుకుని.. పక్కన ఏం జరుగుతుందో తెలియకుండా లోకాన్ని మరిచిపోయిన ఆ ముగ్గురు బాలురు.. క్షణాల్లోనే లోకాన్ని విడిచివెళ్లిపోయారు. పట్టాలపై పబ్జీ గేమ్ ఆడుతుండగా.. వేగంగా వచ్చిన రైలు వారిని ఢీకొట్టడంతో ముగ్గురూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు.. సంఘటనా స్థలానికి చేరుకుని.. ఆ ముగ్గురు బాలుర ఆచూకీ గుర్తించి.. వారి కుటుంబ సభ్యులకు తెలియజేశారు.

పబ్జీ గేమ్. ఇది సరదాగా ఆడే ఆట అయినప్పటికీ.. ఈ పబ్జీ గేమ్‌కు బానిసైన వారి పరిస్థితి ఎలా ఉండేదో మనం ఇప్పటికే చాలా సంఘటనల్లో చూశాం.

పగలు, రాత్రి తేడా లేకుండా పబ్జీ గేమ్ ఆడుతూ.. అందులోనుంచి బయటికి రాలేక అదే ఉచ్చులో చిక్కుకున్న వారిని మనం చాలా మందిని చూశాం. అయితే తేజాగా ఇదే పబ్జీ గేమ్ ముగ్గురు బాలుర ప్రాణాలు తీసింది. చెవిలో ఇయర్ ఫోన్స్ పెట్టుకుని.. రైలు పట్టాలపై కూర్చొని పబ్జీ ఆడుతున్న ముగ్గురు బాలురను అటు వైపు పట్టాల పైనుంచి వచ్చిన రైలు ఢీకొనడంతో వారు స్పాట్‌లోనే మృతిచెందిన ఘటన బీహార్‌లో సంచలనంగా మారింది. ఈ ఘటనతో అప్రమత్తమైన పోలీసులు, రైల్వే సిబ్బంది.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పిలుపునిచ్చారు.

పాట్నాలోని పశ్చిమ చంపారన్ జిల్లాకు చెందిన ముగ్గురు బాలురు.. నార్కటియాగంజ్-ముజఫర్‌పుర్ రైల్వే మార్గంలో పట్టాలపై కూర్చున్నారు. అయితే వారు పబ్జీ ఆడుతుండగా అదే మార్గంలో వచ్చిన రైలు.. వారిని ఢీకొట్టుకుంటూ వెళ్లింది. దీంతో వారు ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. వారు ముగ్గురు చెవుల్లో ఇయర్‌ఫోన్స్ పెట్టుకొని ఉండడం వల్ల.. పట్టాలపై వస్తున్న రైలును వారు గమనించకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు ప్రాథమికంగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ రైలు ప్రమాదంలో చనిపోయిన వారిని ఫర్కాన్ ఆలం, సమీర్ ఆలం, హబీబుల్లా అన్సారీగా గుర్తించినట్లు తెలిపారు.

ఇక ఆ ముగ్గురు బాలుర మృతికి సంబంధించిన విషయాన్ని వారి కుటుంబాలకు సమాచారం అందించారు. వారి మృతదేహాల ను పోస్ట్‌మార్టం చేసేందుకు తరలించినట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ జరుపుతున్నట్లు వెల్లడించారు. అయితే ఇటీవల కొందరు వ్యక్తులు.. ఇలా సురక్షితం కాని ప్రదేశా ల్లో హెడ్‌సెట్ పెట్టుకుని.. పక్కన ఏం జరుగుతుందో పట్టించు కోకుండా ఉండడం వల్ల వారి ప్రాణాలకే కాకుండా ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు కలుగుతోందని పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండేందుకు అలర్ట్‌గా ఉండాలని తల్లిదండ్రులు, అధికారులు తమ పిల్లలకు అవగాహన కల్పించాలని పోలీసులు సూచించారు.

## క్యారమ్స్ ఆటతో కనుచూపు మెరుగు.

- జిల్లాజడ్జి సునీత కుంచాల.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 20:**

ఆటపాటలతో ఆనందం పెరిగి, మానసిక ప్రశాంతత చేకూరుతుం దని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. సోమవా రం జిల్లాకోర్టు ప్రాంగణంలోని బార్ సమావేశపు హాల్ క్యారమ్స్ ఆటలపోటీలను ప్రారంభించి కొద్దిసేపు క్యారమ్స్ ఆడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, మనుషుల నిత్యజీవనంలో ఆటపా టలు ఉంటేనే సంతోషాలు వెల్లివిరు స్థాయని తెలిపారు. గణతంత్ర దినోత్సవం జరుపుకోనున్న శు భతరుణంలో బార్ అసోసియేషన్ వివిధ రకాల క్రీడా కార్యక్రమాలు చేపట్టడం ముదావహమని ఆమె కొనియాడారు. క్యారమ్స్ పై ఆడేటపుడు దృష్టికోణం క్యారమ్స్ పై ఉండటం వలన కనుచూపు మెరుగు పడుతుందని ఆమె తెలిపారు. బార్ అధ్యక్షుడు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ మాట్లాడుతూ నిత్యం ఎన్నో ఒత్తిడులు ఎదుర్కొనే న్యాయవాదులు, న్యాయమూర్తులు క్రీడాపోటీలతో స్వా%శీ%తన పొందగలుగుతారని అన్నారు. కార్యక్రమంలో బార్ ఉపాధ్యాక్షుడు రాజు,ప్రధాన కార్యదర్శి వసంత్ రావు,కార్యదర్శి సురేష్ దొన్పల్,క్రీడల కార్యదర్శి పిల్లి శ్రీకాంత్, కోశాధికారి దీపక్,న్యాయ వాదులు ఎర్రం విగ్నేష్,మానిక్ రాజు,ఆశ నారాయణ, సుజిత్, రణదీశ్, అరేటి, ప్రభుత్వ న్యాయవాది అమిదాల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## దుమ్మురేపిన వందేభారత్ స్లీపర్..

ప్రస్తుతం నడుస్తోన్న ఛైర్‌కార్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. రెండేళ్ల కిందట మోదీ ప్రభుత్వం వీటిని పట్టాలెక్కించింది. 100 శాతానికిపైగా ఆక్యుపెన్సీతో నడుస్తోన్న ఈ రైళ్లు.. గమ్యానికి తొందరగా చేరుస్తున్నాయి. దీంతో ఎక్కువ మంది ఇందులో ప్రయాణానికి మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం ఈ రైళ్లు 700 నుంచి 800 కిలోమీటర్ల దూరంలోని స్టేషన్ల మధ్య నడుస్తున్నాయి. త్వరలోనే వందే భారత్ స్లీపర్ రైలు రాబోతోంది.

కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన సెమీ-హైస్పీడ్ రైలు వందేభారత్ ఎక్స్‌ప్రెస్. ప్రస్తుతం ఛైర్‌కార్‌తోనే నడుస్తుండగా.. త్వరలోనే స్లీపర్ రైళ్లు పట్టాలెక్కనుంది. ఇందుకు సంబంధించిన ట్రయల్ రన్ కొనసాగుతోంది. వేగాన్ని క్రమక్రమంగా పెంచేందుకు చేపడుతోన్న పరీక్షల్లో రైలు గరిష్ఠంగా గంటకు 180 కిలోమీటర్ల వేగం అందుకుంది. ఈ మేరకు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఓ వీడియోను ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేశారు. అందులో వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ రైలు 180 కి.మీ. వేగంతో దూసుకెళ్లింది. అయితే, అంత వేగంలోనూ సీటు వద్ద ఉన్న ట్రేపై ఉంచిన గ్లాసులో చుక్క నీరు కూడా తొణకలేదు.

ప్రస్తుతం, ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సూచనల మేరకు రాజస్థాన్‌లోని కోటా డివిజన్‌లో ఈ ట్రయల్ రన్ నిర్వహించారు. జనవరి 1న రైలును 130 కి.మీ. వేగంతో నడిపారు. ఆ తర్వాత దీన్ని క్రమంగా 140 కి.మీ., 150 కి.మీ., 160 కి.మీ.లు పెంచారు. తాజాగా గురువారం ఈ వేగం గంటకు 180 కిలోమీటర్లకు చేరుకుంది. కోటా నుంచి లబాన్ స్టేషన్ల మధ్య రైలు 180 కి.మీ. వేగంతో ప్రయాణించింది. ట్రయల్ రన్‌లో సాధారణ ప్రయాణికులతో



సమానంగా ఉండే బరువును రైల్లో ఉంచారు. విభిన్నమైన ట్రాక్ పరిస్థితుల్లో దీన్ని పరీక్షించారు. ఈ ట్రయల్స్ వచ్చే నెలలోనూ కొనసాగుతాయని రైల్వే అధికారులు వెల్లడించారు.

వాస్తవానికి డిసెంబరులోనే వందే భారత్ రైలు ట్రయల్ రన్ ప్రారంభమైంది. మధ్యప్రదేశ్‌లోని కజురహో నుంచి ఉత్తర్‌ప్రదేశ్ లోని మహోబా రైల్వే స్టేషన్ల మధ్య రెండు రోజుల పాటు స్లీపర్ రైలుకు ట్రయల్ రన్ నిర్వహించారు.

మొత్తం 16 బోగీలతో వందే భారత్ స్లీపర్ రైళ్లను నడపనున్నారు. ఇందులో 10 థర్డ్ ఏసీ, 4 సెకండ్ ఏసీ, ఒక ఫస్ట్ ఏసీ బోగీ ఉంటుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. సీటింగ్‌తో పాటు లగేజీ కోసం రెండు బోగీలు అదనంగా అందుబాటులో ఉంటాయి. మరో రెండు నెలల్లో స్లీపర్ రైళ్లను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్న రైల్వే శాఖ తొలి దశలో 10 రైళ్లను ప్రవేశపెట్టనుంది.

## కుంభమేళాకు వెళ్లేవారికి శుభవార్త..

ప్రయాగ్‌రాజ్‌లో జనవరి 14 నుంచి ఫిబ్రవరి 28 వరకు 45 రోజుల పాటు జరగనున్న మహా కుంభమేళాకు యూపీ ప్రభుత్వం భారీ ఎత్తున ఏర్పాట్లు చేసింది. తెలుగు రాష్ట్రాల నుంచి ప్రయాగ్‌రాజ్ కుంభమేళాకు వెళ్లేవారి కోసం అదనంగా మరో 26 ప్రత్యేక రైలు సర్వీసులను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. ఈ రైళ్లు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, విజయవాడ,
మచిలీపట్నం, కాకినాడ టౌన్‌బీ తెలంగాణలోని సికింద్రాబాద్, మౌలాలి జంక్షన్, వికారాబాద్ స్టేషన్ల నుంచి నడుస్తాయని తెలిపింది. జనవరి 14 నుంచి ఫిబ్రవరి 27 వరకు పలు తేదీల్లో ప్రత్యేక రైళ్లు ఆయా స్టేషన్ల నుంచి బయలుదేరుతాయని పేర్కొంది. జనవరి 14న రాత్రి 11 గంటలకు గుంటూరు-అజమ్‌గఢ్, జనవరి 16న రాత్రి 7.45 గంటలకు అజమ్‌గఢ్-విజయవాడ, ఫిబ్రవరి 5న రాత్రి 10 గంటలకు మచిలీపట్నం-అజమ్‌గఢ్, ఫిబ్రవరి 7న రాత్రి 7.45 గంటలకు అజమ్‌గఢ్-మచిలీపట్నం, ఫిబ్రవరి 15న సాయంత్రం 5.50 గంటలకు మౌలాలీ-గయ, ఫిబ్రవరి 17న రాత్రి 11.55 గంటలకు మౌలాలి-బనారస్, ఫిబ్రవరి 20న రాత్రి 8.10 గంటలకు కాకినాడ టౌన్-అజమ్‌గఢ్, ఫిబ్రవరి 22న రాత్రి 7.45 గంటలకు అజమ్‌గఢ్-విజయవాడ, ఫిబ్రవరి 19న రాత్రి 7.15 గంటలకు బనారస్-మౌలాలీ, ఫిబ్రవరి 18న మధ్యాహ్నం 3.45 గంటలకు వికారాబాద్-గయ, ఫిబ్రవరి 20న రాత్రి 7.45 గంటలకు గయ-వికారాబాద్, ఫిబ్రవరి 5న రాత్రి 7.20 గంటలకు విజయవాడ
-గయ, ఫిబ్రవరి 7న రాత్రి 7.45 గంటలకు గయ-విజయవాడ, ఫిబ్రవరి 8న మధ్యాహ్నం 2.30 గంటలకు కాకినాడ టౌన్-గయ,
ఫిబ్రవరి 10న మధ్యాహ్నం 2.15 గంటలకు గయ-విజయవాడ, ఫిబ్రవరి 22
సాయంత్రం 4.45 గంటలకు కాచిగూడ-పట్నా, ఫిబ్రవరి 24న సాయంత్రం 5 గంటలకు పట్నా-కాచిగూడ, ఫిబ్రవరి 7న సాయంత్రం 5 గంటలకు సికింద్రాబాద్-పట్నా, ఫిబ్రవరి 9న మధ్యాహ్నం 3.30 గంటలకు పట్నా-సికింద్రాబాద్ నుంచి ఈ రైళ్లు బయలుదేరు తాయని తెలిపింది.

వేగుచుక్క

# గ్రామ, వార్డు సభలపై విస్తృత ప్రచారం.

## - జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి 20**

: ఈ నెల 21 నుండి 24 వరకు రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా, ఆహార భద్రత కార్డు ( రేషన్ కార్డు), ఇందిరమ్మ ఇండ్ల జాబితాలపై జరిగే గ్రామ, వార్డు సభలకు సంబంధించి విస్తృత ప్రచారం చేయాలని, గ్రామ సభల ఆమోదం పొందాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం ప్రజావాణి అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా, మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 535గ్రామసభలు, 80 మున్సిపల్ వార్డు సభలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించి రైతు భరోసా, రైతు



ఆత్మీయ భరోసా, రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు సంబంధించిన ముసాయిదా జాబితాలను ఆయా సభల్లో వివరించి ఆమోదం తీసుకోవాలని తెలిపారు. పథకాలకు సంబంధించిన అంశాలపై అధికారులకు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. గ్రామ, వార్డు సమావేశాల్లో అభ్యంతరాలు, ఆక్షేపణలు, చేర్పుల పై వచ్చిన వాటిపై చర్చించాలని సూచించారు. ప్రతీ పథకానికి సంబంధించి ఒక రిజిస్టర్ ఏర్పాటుచేసి నమోదు చేయాలని అన్నారు. గ్రామ, వార్డు సమావేశాల్లో కొత్తగా వచ్చిన దరఖాస్తు లను స్వీకరించి ఆ తదుపరి విచారణ చేయడం జరుగుతుందని దరఖాస్తు దారులకు తెలియజేయాలని తెలిపారు. రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించడం నిరంతర ప్రక్రియ అని వివరంగా తెలియజేయాలని అన్నారు. పై నాలుగు పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాలను ఆయా మండల అధికారులకు పంపడం జరిగిందని, వాటిని డౌన్ లోడ్ చేసుకోవాలని తెలిపారు. రెవిన్యూ, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, అంగన్ వాడీ లను నియమించుకొని సహాయకులుగా విధులు అప్పగించాలని తెలిపారు.
గ్రామ సభల అనంతరం రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా లకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాలను ప్రకటించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి , ఆర్డీఓ రంగనాథ్ రావు, జడ్పీ సీఈవో చందర్ నాయక్, అధికారులు పాల్గొన్నారు.

# "డైరీ" మన నిరంతర శ్రమను ప్రతిఫలించే ప్రతీక.



**- టియు వైస్ ఛాన్సర్ టి. యాదగిరి రావు.**

**- తెలంగాణ యూనివర్సిటీ డైరీ ఆవిష్కరణ.**

**వేగుచుక్క న్యూస్, డిచ్ పల్లి, జనవరి 20:**

"డైరీ" మన నిరంతర శ్రమను ప్రతిఫలించే ప్రతీక అని టియు వైస్ ఛాన్సర్ టి. యాదగిరి రావు అన్నారు. తెలంగాణ విశ్వవిద్యాలయంలో తెలంగాణ వర్సిటీ డైరీ ని వైస్ -ఛాన్సర్ టి. యాదగిరి రావు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ యాదగిరిరావు మాట్లాడుతూ, డైరీలో విశ్వవిద్యాలయం సంబంధించిన ముఖ్యమైన సమాచారం, విద్యా కార్యక్రమాలు మరియు ఇతర ఉపయోగకరమైన వివరాలు ఉన్నాయన్నారు. ఇది కేవలం ఒక డైరీ మాత్రమే కాదని ఇది మన సమిష్టి కృషిని , మన ప్రగతిని మరియు మన నిరంతర శ్రమను ప్రతిఫలించే ప్రతీక అన్నారు. ఈ క్యాలెండర్ సంవత్సరంలో టీచింగ్, నాన్ టీచింగ్ సమన్వయంతో పనిచేసి రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో విశ్వవిద్యాల యాన్ని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపాలని తెలియ జేశారు. ఈ డైరీ ని అద్భుతంగా రూపొందించడంలో విశేష కృషి చేసిన పబ్లికేషన్ సెల్ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ రెడ్డి ని అభినందిం చారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో పబ్లికేషన్ సెల్ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, ఆడిట్ సెల్ డైరెక్టర్ గంట చంద్రశేఖర్, కంట్రోలర్ ఆచార్య ఎం. అరుణ, యూజీసీ కోఆర్డినేటర్ , డీన్లు ఆచార్య లావణ్య ఆచార్య అపర్ణ, ఆచార్య రాంబాబు, ఆచార్య సంపత్ రెడ్డి పాల్గొన్నారు.

# లిక్కర్ పైననే కవిత ఇంట్రెస్ట్.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 20:**

ఎమ్మెల్సీ కవితకు లిక్కర్ మీద ఉన్న ఇంట్రెస్ట్ పసుపు రైతుల మీద లేదని, నిజామాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి పేర్కొన్నారు. సోమవారం భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పసుపు రైతుల కోసం అలుపెరుగని పోరాటం చేశానన్న కవిత మాట్లాడిన మాటలు వింటుంటే ప్రజలు, పాత్రికేయలే కాకుండా టిఆర్ఎస్ నాయకుల సైతం నవ్వుకుంటున్నారన్నారు. ఆమె తీహార్ జైలుకు సైతం పసుపు బోర్డు సాధన కొరకే వెళ్లినట్టు చెప్పుకుందన్నారు. కవిత త్రిముఖ వ్యూహం గురించి మాట్లాడుతుందని, వాళ్ల కుటుంబ త్రిముఖ వ్యూహం ఏందో ప్రజలందరికీ తెలుసన్నారు. ఆస్తులు కూడబెట్టడం, ప్రజలను హింసించడం, ప్రతిపక్షాలని బెదిరించడం, ఇవే వారి అసలు త్రిముఖ వ్యూహాలన్నారు. ప్రతీ మూడేళ్లకోసారి పసుపు ధర పెరుగుతుందని, అందులో ఎంపీ అర్వింద్ గొప్పతనం ఏమీ లేదని కవిత అన్నారని, మరి కవిత ఐదేళ్లు ఎంపీగా ఉన్నప్పుడు పసుపు ధర ఎందుకు




పెరగలేదన్నారు. కవితకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వం పసుపు రైతుల కొరకు వేల్పూర్ లో స్పైసెస్ పార్క్ కొరకు 42 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించినపుడు, కనీసం ఒక వ్యవసాయాధార పరిశ్రమని కూడా ఎందుకు తేలేకపోయారనని ప్రశ్నించారు. కేవలం మీ కమీషన్లకు భయబడే పారిశ్రామికవేత్తలు వెనక్కి వెళ్లిపోయారన్నారు. ప్రపంచానికి యోగా నేర్పిన రాందేవ్ బాబాని కూడా భయపెట్టిన చరిత్ర కవితదన్నారు. పసుపు శుద్ధి కర్మాగారాలు పెట్టాలంటే, అక్కడున్న

**పసుపు రైతుల కోసం సుతిలి,**
**దబ్బనం కూడా కవిత ఇయ్యలే.**
**ప్రోటోకాల్ గురించి కవిత**
**మాట్లాడం హాస్యాస్పదం.**
**బీజేపీ ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి.**

అప్పటి ఎంపీ కవిత కి ఆత్మశుద్ధి కావాలని రాందేవ్ బాబా తన శిష్యులతో అన్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పసుపు రైతుల గురించి పలువురిని కలిశానని కవిత గొప్పలు చెప్పుకుంటున్నారని, కానీ పసుపు బోర్డు ని సాధించిన తమ నాయకుడు ఏనాడు కూడా తన గొప్పదనం అని పేర్కొనలేదని అన్నారు. పసుపు రైతుల కొరకు కవిత కనీసం సుతిలి, దబ్బనం కూడా ఇవ్వలేదని, కానీ తమ నాయకుడు మాత్రం వందల సంఖ్యలో బాయిలర్లు, పాలిషర్లు, వేల సంఖ్యలో టార్పాలిన్ షీట్లు అందించారన్నారు. తాను పోరాటం చేస్తున్నప్పుడు అరవింద్ కు రాజకీయాలు కూడా తెలియవని కవిత అంటున్నారని, ఆమె తండ్రి కేసీఆర్ కి రాజకీయ జీవితం ఇచ్చిన డి శ్రీనివాస్ కుమారుడైన అరవింద్ కు రాజకీయాలు తెలియవా అని ప్రశ్నించారు. ప్రోటోకాల్ గురించి కవిత మాట్లాడడం విడ్డూరంగా ఉందని, 10 సంవత్సరాల టి(బీ)ఆర్ఎస్ నాయకులు ఏనాడైనా ప్రోటోకాల్ పాటించారా? అని అంటూనే, ప్రధాని మోడీ రాష్ట్రానికి వచ్చినప్పుడు కూడా కెసిఆర్ ఫామ్ హౌస్ లో పడుకున్నారన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు ప్రవళిక, మెట్టు విజయ్, సుక్క మధు , సుధీర్, ఇందిరా, వనిత, బైకాన్ సుధా, సుమిత్ర, ఆకుల హేమలత, సాయి వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 20**

: మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వొద్దని ఎంవీఐ కిరణ్ కుమార్ అన్నారు. జాతీయ భద్రత మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం నగరంలోని శివాజీ నగర్ లో గల రామకృష్ణ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కిరణ్ మాట్లాడుతూ, మైనర్లు బైకులు డ్రైవ్ చేయొద్దని, హెల్మెట్ లేకుండా లైసెన్సులు, సరైన పత్రాలు లేకుండా డ్రైవింగ్ చేయొద్దని అన్నారు. అదేవిధంగా రోడ్డు భద్రతా నియమాలు పాటించి సురక్షితంగా ప్రయాణం చేయలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోటార్




వెహికల్ ఇన్స్పెక్టర్ రాహుల్, ఐరాడ్ జిల్లా మేనేజర్ వర్షా నిహంత్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# గణతంత్ర దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు.

## - కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, జనవరి 20 :**

గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. నిజామాబాద్ పోలీస్ పరేడ్ మైదానంలో జరిగే రిపబ్లిక్ డే వేడుక సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో జిల్లా ప్రగతి నివేదిక



రూపొందించాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఆహార భద్రతా (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి శకటాలను ప్రదర్శించాలని కలెక్టర్ సూచించారు. వీటితోపాటు గృహాజ్యోతి, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, రైతు రుణ మాఫీ, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాల ప్రాధాన్యతను చాటేలా శకటాలను ప్రదర్శించాలని సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణాభివృద్ధి, పశు సంవర్ధక, విద్య, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం, ఫిషరీస్, ఇరిగేషన్ తదితర శాఖల పనితీరును చాటేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించేందుకు గాను శాఖల వారీగా పరిమితితో కూడిన ప్రతిపాదనలు పంపించాలని అన్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో సమర్ధవంతంగా విధులు నిర్వహించిన సిబ్బందికి ప్రాధాన్యతనిస్తూ, ఈ నెల 22వ తేదీ లోగా పేర్లను ప్రతిపాదనల రూపంలో సిఫార్సు చేయాలని
అధికారులకు సూచించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా విద్యుత్ సరఫరాలో
అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్కో అధికారులను ఆదేశించారు. దేశభక్తిని చాటేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్, అదనపు డీసీపీ బస్వారెడ్డి, డీఆర్డీఓ సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# సిపిఎం రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్ల ఆవిష్కరణ.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, జనవరి 20:**

ఈనెల 25 నుండి 28 వరకు సంగారెడ్డిలో జరిగే సిపిఎం తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభల వాల్ పోస్టర్లను భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కే చంద్రశేఖర్ మాట్లాడుతూ, సిపిఎం పార్టీ




రాష్ట్ర మహాసభలు సంగారెడ్డి కేంద్రంగా నాలుగు రోజులపాటు జరగనున్నాయని, వాటిని విజయవంతం చేయాలని కోరారు. ఈ మహాసభలకూ సిపిఎం పోలీట్ బ్యూరో సభ్యులు బృంద కారత్, బివి. రాఘవులు హాజరు అవుతారన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆ మహాసభల్లో చర్చలు జరిపి సమస్యల పరిష్కారం కోసం తీర్మానాలు చేసి, పోరాటాల రూపొందిస్తామని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని వాటిపై చర్చలు జరిపి భవిష్యత్తు పోరాటాలకు పిలుపునిస్తామని కావున మహాసభల విజయవంతం కోసం కామారెడ్డి జిల్లా ప్రజలంతా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకట్ గౌడ్, నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు అరుణ్, నాయకులు ప్రకాష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన భూముల జోలికి వస్తే సహించం.

**కబ్జాదారులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి.**

**గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు జైపాల్ నాయక్.**

**వేగుచుక్క న్యూస్, సంగారెడ్డి, జనవరి 20**

: గిరిజన భూముల జోలికి వస్తే సహించం అని, కబ్జాదారులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలనీ గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు జైపాల్ నాయక్ డిమాండ్ చేశారు.
సోమవారం సంఘం ఆధ్వర్యంలో వెలిమల తండాకు సందర్శించి గిరిజనులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకొన్నారు. అక్కడినుండి శంకర్ పల్లి మండలం కొండగల్ గ్రామ గుడితాండలో గత 20 రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జైపాల్ నాయక్ మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం మండలం



వెలిమల తండాకు అనుకుని, రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలం కొండకల్ గ్రామ గుడి తండా శివారులోని 80 ఎకరాల భూములు బీలాదాకాల భూములు ఉన్నాయని అన్నారు. సర్వే నంబర్ 633, 634, 635, 636, 637, 638, 639, 640, 641, 642, 643, 644 లలో గిరిజనులు గత కొన్ని సంవత్సరాల నుండి కబ్జాలో ఉండి వ్యవసాయం సాగు చేస్తూ జీవనం గడుపుతున్నారని పేర్కొన్నారు. కొంతమంది గిరిజనులకు ప్రభుత్వం 1997లో ఫైనల్ పట్టా సర్టిఫికెట్లు జారీ చేసిందని, కొంత వారికి వారసత్వంగా వచ్చిన పట్టా భూములు, పీటీ భూములను సాగు చేస్తూ వారి తాత ముత్తాతల నుండి శిస్తు పన్నులు కడుతూ భూమిని సాగు చేస్తున్నారని అన్నారు. కానీ ఆ భూములను అన్యాయంగా, ఆక్రమంగా విక్రమ్ కుమార్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి తమ పేరు మీద మార్చుకొని అపర్ణ, గ్రీన్ మార్క్, రియల్ ఎస్టేట్ కంపెనీలకు అమ్ముకొన్నారని అన్నారు. గిరిజనులు అడ్డు వస్తె అన్యాయంగా ఆక్రమంగా రౌడీ షీటర్, 307 కేసులు నమోదు చేయించి ఇబ్బందులు గురి చేస్తున్నారని
అన్నారు. అపర్ణ గ్రీన్ మార్క్ రియల్ ఎస్టేట్ కంపెనీల భూ ఆక్రమణలు అరాచకాల పై విచారణ చేపట్టి గిరిజనులకు ఇబ్బందుల గురి చేస్తున్న
అపర్ణ, గ్రీన్ మార్క్, అరబిందో ఫార్మా యజమాన్యంపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇదే సర్వే నంబర్ లో గల రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యుల భూములపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని, గిరిజనుల భూముల జోలికొస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. న్యాయం జరిగే వరకూ పోరాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంగం జిల్లా నాయకులు ప్రకాష్ నాయక్, చందర్ నాయక్, రవి నాయక్, రాకేష్ లు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవలకు అవార్డులు.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 20:**

వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన వారికి రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ ఆద్వర్యంలో ఒకేషనల్ ఎక్స్ లెన్సీ



అవార్డులను ప్రధానం చేశారు. నగరంలోని ఒక హొటల్ లో ఆదివారం రాత్రి అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. నిజామాబాద్ పాలిటెక్నిక్ మైదానంలో పచ్చదనం పరిశుభ్రత కోసం కృషి చేస్తున్న రిటైర్డ్ మిలిటరీమెన్ అశోక్, ఆవులు, పక్షులకు నీరు, ఆహారాన్ని అందజేస్తున్న పాత్రికేయుడు సిరిగాద ప్రసాద్, అంధుల కోసం ప్రత్యేకంగా కళ్లద్దాలు తయారు చేసిన ఆదిలాబాదుకు చెందిన రవికిరణ్ లకు రోటరీ క్లబ్ గవర్నర్ గట్టు జ్ఞానప్రకాష్ అవార్డులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ గట్టు జ్ఞానప్రకాష్, డిప్యూటీ గవర్నర్ ఆకుల అశోక్, రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ అద్యక్షులు పద్మ శ్రీనివాస్, కార్యదర్శి గౌరీశంకర్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.